తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## ఎన్టీఆర్ జలాశయానికి జలహారతి

చిత్తూరురూరల్, అక్టోబరు 18 ప్రభాతవార్త:



చిత్తూరునగర శివారులో గల కలవగుంట వద్దనున్న జలాశయానికి శనివారం చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ జలహారతి ఇచ్చారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు, రైతులు సంతోషంగా వుండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించి గంగమ్మకు పసుపు, కుంకుమ, వస్త్రాలతో హారతినిస్తూ గేట్లను ఎత్తి నీటిని వదిలారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, కమీషనరు నరసింహప్రసాద్, ఎంఈ వెంకటరామిరెడ్డి, డిఈలు శ్రావణి, రమణ, నగర అధ్యక్షుడు నరేష్, తెలుగు మహిళా నగర అధ్యక్షురాలు నళిని, నాయకులు వెంకటేష్‌యాదవ్, వరలక్ష్మి, రాణి, మోహన్‌రాజ్, సబిత, ప్రతిభ, నీరజాక్షులునాయుడు, ఉదయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా మోర్య నియామకం

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :



తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ గా మోర్యను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా నుండి మోర్యకు ఉత్తర్వులు అందాయి. ప్రస్తుతం ఈమె తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు అదనపు బాధ్యతలు కింద తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ గా మోర్య విధులు నిర్వహించనున్నారు. దీపావళి పండుగ తర్వాత బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.



### ఆధ్యాత్మిక నగరాన్ని భయపెడుతున్న

# 'నకిలీ మెయిల్స్'!

### -బాంబుల పేరుతో ఉన్మాదుల వికృతానందం

ప్రభాతవార్త-తిరుపతి:
ఆధ్యాత్మిక నగరం, యాత్రాస్థలం తిరుపతినగరంలో ఇటీవల కొద్దిరోజులుగా నకిలీ మెయిల్స్ బాంబు బెదిరింపులు భయపెడుతున్నాయి. ఈ వ్యవహారం పోలీసుయంత్రాంగానికి తలనొప్పిగా మారింది. నిత్యం యాత్రికుల రాకపోకలతో..నగరవాసులతో,పలు రకాల పనులనిమిత్తం వస్తున్న జనంతో పందడిసందడిగా ఉంటుంది. ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న తిరుపతి నగరాన్ని వరుసగా నకిలీ బాంబు మెయిల్స్ వణికిస్తున్నాయి. ఈ వ్యవహారం గందరగోళంగా తయారైంది. ఇటీవల తాజాగా శుక్రవారం ఒకరోజు క్రిందట ఏకంగా నకిలీ మెయిలర్స్ తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో శక్తివంతమైన బాంబులు అమర్చామని, పేల్చేస్తామంటూ నకిలీ మెయిల్ చేయడం మరీ ఆందోళన కలిగిస్తోంది. వెంటనే పోలీసు అధికారులు, బాంబుడిస్పోజల్ టీమ్ పోలీసులు, పోలీసు జాగిలాలు కలెక్టరేట్‌కు చేరుకుని అణువణువూ నిశితంగా తనిఖీలు చేశారు. ఎక్కడా ఎలాంటి బాంబులు లేవని తేలడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. తిరుపతిలో వరుసగా హోటళ్ళకు, లాడ్జీల్లో బాంబులు పెట్టామని నకిలీ మెయిల్‌లు శ్రీవారి భక్తులకు,ప్రముఖులకు కొంత అసహనం కలిగించేలా తయారైంది. తిరుపతిలో జనానికి కంటిపై కునుకు లేకుండా చేస్తున్న ఉన్మాదులను,వారి వికృతచేష్టలను సైబర్‌క్రైమ్ పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించి కట్టడిచేయాలనేది జనంలో మాట. తిరుపతి నగరం ప్రాముఖ్యతతో 24గంటలూ పోలీసు విభాగంఅప్రమత్తంగా వ్యవహరిస్తూ ఉంది. నగరం శివార్లలో, ప్రధాన వాణిజ్యసంస్థలు, హోటళ్ళు, లాడ్జీలు, స్టార్‌హోటళ్ళు, నగరానికి ప్రధాన ప్రవేశ కూడళ్ళు, నగరం అంతా అత్యాధునిక నిఘా నేత్రాలు డేగకళ్ళతో పహరాకాస్తున్నాయి. ఈ నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానం పోలీసులు మరింతగా వినియోగించుకుని ప్రజలకు భద్రత కల్పిస్తున్నారు. ఇంత పటిష్ట భద్రత నడుమ నకిలీ మెయిల్స్ జనంలో ఆందోళన కలిగిస్తోంది. గతంలో ఇస్కాన్ ఆలయం, పలు హోటళ్ళకు ఈ బెదిరింపు మెయిల్స్ రావడం విచారకరం. ఈ నకిలీ మెయిల్స్ చెన్నై,తమిళనాడు నుండి వస్తుండటంతో వారిపై కఠినంగా వ్యవహరించాలనేది జనం విజ్ఞప్తి. అయితే పోలీసు అధికారులు కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మీ భద్రత మా లక్ష్యంఅని ప్రచారం చేస్తూ చైతన్యం తీసుకువస్తున్నారు. నగరంలో డ్రోన్ కెమెరాలతో కూడా పోలీసు యంత్రాంగం 24గంటలూ పహరాకాస్తోంది. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్న పోలీసులు ఇలాంటి ఫేక్‌మెయిల్స్‌పై కఠినంగా వ్యవహరించాలనేది విజ్ఞప్తి

### కుండపోత వర్షానికి

# తెగిన వంక

### -జలదిగ్బంధంలో చుక్కావారిపల్లి
### -నీటమునిగిన పంట పొలాలు



గ్రామంలోకి చొరబడుతున్న వంకనీరు

చౌడేపల్లి, అక్టోబర్ 18 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. శనివారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి గ్రామానికి ఎగువనున్న కుంటతెగి ఊరిమీద పడటంతో గ్రామస్తులు జలదిగ్బంధంలో కొట్టుమిట్టాడారు. చుట్టూ వున్న పంట పొలాలు నీటమునిగాయి. మండలంలోని పందిళ్ళపల్లి పంచాయతీ చుక్కావారిపల్లికి సమీపంలో అటవీప్రాంతముంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి చుట్టుపక్కలున్న వాగులు, వంకలు నిండిపోయాయి. ఈక్రమంలో శనివారం రాత్రి ఈ ప్రాంతంలో కుండపోత వర్షం కురిసింది. దీంతో గ్రామానికి సమీపంలోని మాదవకుంటవంక తెగి చుక్కావారిపల్లిలోగల లోతట్టు ఇళ్ళల్లోకి నీరు చేరుకొన్నాయి. గ్రామం నడిబొడ్డునుంచి వర్షపునీరు ధారలో పోతుండటంతో గ్రామస్తులు ఇళ్ళను విడచి బయట ప్రాంతాలకు తలదాచుకునేందుకు వెళుతున్నారు. రాత్రి వేళ వర్షానికి తోడు విద్యుత్ సరఫరా నిలచిపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షానికి చుట్టుపక్కలున్న వరి, టమోటా వంటి వాణిజ్య పంటలు నీట మునిగాయని రైతులంటున్నారు. అదే విధంగా మేకలచిన్నేపల్లి నాయనిచెరువు, శెట్టిపేట పెద్దచెరువు సైతం ప్రమాదకరంగా వున్నాయి. ఆదుకొనే ఆపన్నహస్తం కోసం చుక్కావారిపల్లి గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు.

**అప్రమత్తంగా వుండాలి : తహశీల్దార్ పార్వతి**

మండల వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా వుండాలని తహశీల్దార్ పార్వతి అన్నారు. అదే విధంగా రెవిన్యూ అధికారులు, విఆర్వోలు ఎప్పటికప్పుడు గ్రామాల పరిస్థితులను తెలుసుకొంటూ వుండాలన్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, కుంటలు, చెరువులు వర్షపు నీటితో నిండు కుండలా వున్నాయనీ, మరలా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు, ప్రజలు, రైతులు అప్రమత్తంగా వుండి ఎప్పటికప్పుడు సమాచారాన్నందించాలన్నారు.

## కల్యాణ వెంకన్నకు 'పవిత్ర సమర్పణ'



చంద్రగిరి, అక్టోబర్ 18 ప్రభాతవార్త:
శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం పవిత్ర సమర్పణ ఆగమోక్తంగా నిర్వహించారు. కల్యాణ వెంకన్న వారి పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంక ర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి, బాలాజీ రంగాచా ర్యులు, ఆలయ అర్చకులు నారాయణాచార్యులు చేతుల మీదుగా రెండవ రోజున ఆలయంలోని మూలవర్లకు, ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ గావించారు. తదుపరి ఉత్సవ మూర్తులకు పాలు, పెరుగు, కొబ్బరినీళ్ళు, చందనంతో అభిషేకం (స్నపనతిరుమంజనం) నిర్వ హించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అ తన దేవేరులతో తిరుమాడ వీధులలో ఊరేగారు. రాత్రి యాగశాలలో వైధిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి,సూపరింటెండెంట్స్ వల్లంశెట్టి రమేష్‌బాబు, రాజ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ఆనుంబట్టు ధనశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## కల్యాణిరేవులో డ్రోన్ కెమెరాలతో గాలింపు

### యువకుడి మృతదేహం లభ్యం

పలమనేరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త:
పలమనేరు రూరల్ మండలం కాలువపల్లె వద్ద అటవీ ప్రాంతంలోని కల్యాణిరేవులో గల్లంతైన యువకుడు యూనస్ (23) మృతదేహం లభ్యమైంది. మూడో రోజు డ్రోన్ కెమెరాలతో గాలించడంతో రెండు కి.మీల దూరంలో బండల మధ్య చిక్కుకున్న మృతదేహం బయటపడింది. పలమనేరు పాత పేటకు చెందిన యూనిస్ తన స్నేహితులతో కలిసి ఈ నెల 16న సాయంత్రం కల్యాణిరేవులో ఈతకు వెళ్ళడం, ప్రవాహం ఉధృతంగా ఉండడంతో స్నేహితులు తిరిగి రావడం, యూనస్ ప్రవాహంలో దూకి గల్లంతు కావడం తెలిసిందే. విషయం తెలుసుకున్న సిఐ మురళీమోహన్, ఎస్ఐ లోకేష్ సిబ్బందితో వెళ్ళి అదే రోజు సాయంత్రం గాలించారు. ఐతే చీకటిపడడంతో తిరిగి రెండో రోజు ఈనెల 17న ఉదయం పోలీసులు, అటవీ శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులతో ఉదయం నుండి నుండి సాయంత్రం వరకు గజ ఈతగాళ్ళలతో గాలించినా ఫలితంలేక పోయింది. దీంతో చివరి ప్రయత్నంగా మూడో రోజు శనివారం డ్రోన్ కెమెరాలతో గాలింపు చేపట్టారు. దీంతో సంఘటనా స్థలం నుండి రెండు కిలో మీటర్ల దూరంలో బండల మధ్య చిక్కుకున్న మృతదేహం బయటపడింది. అతికష్టం మీద మృతదేహాన్ని వెలికి తీసి శవపరీక్షకు అంబులెన్స్‌లో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహం తీసుకు వస్తున్న దృశ్యం.

## మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడం కరెక్ట్ కాదు

### మాజీ మంత్రి రోజా



కోటి సంతకాల సేకరణ కరపత్రాలు విడుదల చేస్తున్న రోజా

పుత్తూరు, అక్టోబరు 18 ప్రభాతవార్త :
దురుద్ధేశపూర్వకంగానే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తోందని వైసిపికి చెందిన పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా ఆరోపించారు. గత వైసిపి ప్రభుత్వంలో మంజూరై యాభై శాతానికి పైగా నిర్మాణాలు పూర్తి చేసుకున్న కాలేజీలను ప్రైవేటు పరం చేసి వైద్య విద్యార్థులకు అన్యాయం చేస్తోం దని విమర్శించారు. శనివారం పట్టణంలోని ఒక కల్యాణమండపంలో వైసిపి పట్టణ, రూరల్ విభాగాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడాన్ని వైసిపి తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఈ మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలంతా సంతకాల సేక రణలో పాల్గొని కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్ ఛైర్మన్లు డి.జయప్రకాశ్ (చిట్టి), డి.శంకర్ పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం: మరొకరికి తీవ్రగాయాలు

శాంతిపురం, అక్టోబర్ 18 ప్రభాతవార్త



మృతి చెందిన వెంకటరామప్ప,పక్కన సత్యప్ప

కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో స్థానిక పాలారు బ్రిడ్జి సమీపంలో శనివారం మధ్యాహ్నం ఓ కారు టువీలర్‌ను ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని కెనమాకులపల్లికి చెందిన వెంకటరామప్ప (60),సత్యప్ప (60)లు టువీలర్‌లో వస్తుండగా వి.కోట వైపునుంచి వచ్చినకారు వీరిటువీలర్‌ను ఢీకొంది. దీంతో వెంకటరామప్ప తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యప్పను కుప్పం పిఇఎస్‌కు తరలించారు. కాగా టు వీలర్‌ను ఢీకొన్న కారు ఆపకుండా వేగంగా వెళ్లడ ంతో ప్రజలు ధరా ్నకు దిగారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కాగా కారును గుంజార్లపల్లి వద్ద వదిలి వెళ్లిపోవడంతో పాటు కారులో ఉన్న వారుతుమ్మిశికి చెందిన వారని సమాచారం.విషయం తెలుసుకున్న ఎస్సై నరేష్ సంఘటనా స్థలికి చేరుకుని బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కాణిపాకం దేవస్థానంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ



కాణిపాకం, జూలై 19 ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర దేవాదాయ, దర్మధాయశాఖ ఆదేశాల మేరకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స వ్చ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మొదటగా ఆలయ సిబ్బందితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం దేవస్థానం అతిథి గృహంలో ఆలయ అధికారులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేసి ఆలయ మాఢా వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ పచ్చదనం, పరిశుభ్రత ప్రగతికి సోపానాలని తెలిపారు.ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. షాపులు, హోటళ్ళులో ప్లాస్టిక్ కవర్లు వాడరాదని, డీగ్రేడబుల్ కవర్లును వాడాలని యజమానులకు సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈఓ హెచ్చరించారు. ఆలయ ఏఈఓలు ధనుంజయ, రవీంద్రబాబు, ఎస్వీ,కృష్ణారెడ్డి, ప్రసాద్, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

### మానవ జీవన వికాసానికి

# కళలే మూలాధారం

**- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ విజయభాస్కరరావు**
**- ఎస్వీయూలో ముగిసిన మూడు రోజుల యువతరంగ్ 2025 కార్యక్రమం**
**- వివిధ సంగీత, నృత్య, కళా పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం**

తిరుపతి విద్య అక్టోబర్ 18 ప్రభాత వార్త:



మనిషి జీవన వికాసానికి కళలు మూలాధారంగా నిలుస్తాయని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ విజయభాస్కర రావు పేర్కొన్నారు.గత మూడు రోజులుగా ఎస్వీ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చర్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన యువతరంగ్ 2025 కార్యక్రమం శనివారం ముగిసింది. ఇందుకు సంబంధించిన సమాపనోత్సవం శనివారం సాయంత్రం శ్రీనివాసా ఆడిటోరియంలో చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ విజయభాస్కరరావు మాట్లాడుతూ యువతరంగ్ 2025 కార్యక్రమంతో విద్యార్థుల్లో సాంస్కృతిక ఉత్తేజం కలిగిందని తెలిపారు.చదువుతోపాటు క్రీడా సాంస్కృతిక అంశాల్లోనూ ప్రతిభను పెంచుకోవాలని కోరారు. కళలను కాపాడుకోవడం ద్వారా మన సంస్కృతీ సాంప్రదాయాలను పరిరక్షించుకున్నట్టు అవుతుందని అన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు మాట్లాడుతూ ఎన్నో గొప్ప చారిత్రక సాంస్కృతిక కార్యక్రమాలను యూనివర్సిటీ చేపట్టిందని గుర్తు చేశారు.దీని ద్వారా విద్యార్థులకు సంగీతం, నృత్యం, కళల పట్ల ఆసక్తిని పెంపొందించినట్టు అయిందని చెప్పారు. .ప్రత్యేకించి మిమిక్రీ,స్కిట్,వన్ యాక్ట్ ప్లే వంటి ప్రదర్శనలు ప్రేక్షకులను కట్టిపడేసాయి.ఫోక్ ఆర్కెస్ట్రా తో కళాకారులు గ్రామీణ జీవన సంస్కృతిని కళ్ళ ముందు పరిచారు. క్రియేటివ్ కొరియోగ్రఫీ, క్విజ్, క్లే మోడలింగ్, రంగోలీ పోటీలు సృజనాత్మకంగా సాగాయి.ఇందులో విద్యార్థులు ఎంతో ప్రత్యేక ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు.ఈ సాంస్కృతిక ప్రదర్శనలను న్యాయ నిర్ణేతలు పరిశీలించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసే వారు అభినందించారు.

# పండగల్లో కానరాని ఉత్సాహం

### జనం సందడిలేని దుకాణాలు
### టపాకాయల దుకాణాలు వెలవెల - వర్షాలతో సతమతం



జనం లేక వెల వెల బోతున్న టపాయకాలయ దుకాణాలు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 18 ప్రభాతవార్త
గతంలో పండగలంటే ఎంతో ఉత్సాహం, వారం రోజులు ముందు నుంచి హడావిడి.మూడు రోజులు బట్టల దుకాణాలు, మూడు రోజుల పాటు కిరాణ దుకాణాల్లో జనం సందడి చోటు చేసుకునేది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా పండగలంటే నిరాశ చోటు చేసుకుంటుంది.ఈ ఏడాది అక్టోబర్ మాసంలో సాధారణ సగటు వర్షపాతం కన్నా అధికంగా నమోదౌతుంది.ఈ నేపథ్యంలో మూడు రోజులుగా ఎడతెరపి లేని వర్షంతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. దాంతో మరో రెండు రోజుల్లో దీపావళి పండగ అంటే సందడే లేదు.ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాలు కూడా ప్రశ్నార్థకంగా మారింది,సోమవారం దీపావళి.కానీ శనివారం కూడా ఆ సందడి కనబడలేదు. శ్రీకాళహస్తి కేంద్రంగా బాణసంచా విక్రయాలు జరుగుతాయి.ఇందుకు విక్రయాలకు పట్టణానికి బయట అయ్యలనాడుచెరువులోని బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో అధికారులు అనుమతించారు. కానీ దీపావళి రెండుల ముందు కూడా ఇక్కడ వ్యాపారం సందడి కనబడలేదు.

**వెల వెల బోతున్న గ్రామాలు:**

ఈ ఏడాది పండగలు నిరాడంబరంగా సాగుతున్నాయి. దసరా ఊసే లేదు. ఇక దీపావళికి గ్రామాల్లో ఎక్కడా సందడి కనబడ లేదు.గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది గ్రామాలు వెల వెల బోతున్నాయి. సాధారణంగా దీపావళి అంటే పట్టణంలోనూ, పల్లెల్లో బాణ సంచా శబ్దాలు దద్దరిల్లేవి.ఆకాశ చువ్వలతో మతాబులతో కన్నుల పండువగా కల్గించేవి. కానీ ఈ ఏడాది ఆ వాతావరణమే కనబడటం లేదు.ఢాం ఢాం కాదు కదా కనీసం మతాబుల వెలుగులు కూడా లేదు.ఎప్పుడూ వ్యాపారాల్లో బిజీగా ఉండే బట్టల, కిరాణ దుకాణాలు వెల వెల బోతున్నాయి.ఇదేమి పరిస్థితి అని వ్యాపారులు తల్లడిల్లుతున్నారు. పండగ వ్యాపారాలపై నమ్మకంతో సరకులు తెచ్చుకున్న వ్యాపారులు లబోదిబో అంటున్నారు.ఇక బాణ సంచా వ్యాపారులు చేతులు ముడుచుకొని కూర్చొన్నారు. దీపావళి అంటే వన్‌టౌన్ పోలీసు స్టేషన్ మలుపు నుంచి బాబూ అగ్రహారం పాత నెల్లూరుబస్టాండు రోడ్డు, ఆర్‌టిసి సర్కిల్ నుంచి ఏరియా ఆసుపత్రిరోడ్డులో కాలుమోపటానికి వీలు పడేది కాదు.కానీ శనివారం పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.కనీసం శనివారం రోజు జరిగే వ్యాపారాలు కకూడా లేదు. బస్సులు ఖాళీగా పయనం సాగిస్తున్నాయి.గ్రామాల్లో దీపావళి అమావాస్యలాగే తమ జీవితాలు చీకటిమయమయ్యాయని వాపోతున్నారు.

# ముగ్గురు మహిళ దొంగలు అరెస్టు

### బంగారునగలు,మోటారుసైకిళ్ళు స్వాధీనం

తిరుపతి,అక్టోబర్ 18ప్రభాతవార్త:
ప్రయాణీకుల సంచుల్లో బంగారు నగలు దొంగతనం చేసి,దానికితోడు మోటారుసైకిళ్ళను చోరీచేసిన ముగ్గురు మహిళ దొంగలను తిరుపతి క్రైమ్ పోలీసులు అరెస్టుచేశారు. వారినుండి సుమారు రూ.25లక్షల విలువైన 230 గ్రాముల బంగారునగలు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. శనివారం సాయంత్రం ఈ వివరాలను క్రైమ్ అదనపు ఎస్పీ నాగభూషణ్‌రావు, శాంతిభద్రతలు రవిమనోహరచారి మీడియాకువెల్లడించారు. కుప్పం లక్ష్మీపురానికి చెందిన ఎస్.జ్యోతి (32), వి.నందిని(30), ఎ.ప్రియా(26)లు బంగారు నగలు చోరీకి పాల్పడ్డారు. ఇంకా వీరిపై విశాఖపట్నం, మల్యాపురం, కోదూరు, అలిపిరి పోలీస్‌స్టేషన్‌లలో తమిళనాడులో పాత కేసులు నమోదయ్యాయి. ద్విచక్రవాహనాలను చోరీ కేసులో ప్రకాశం జిల్లా కొండరాజుపల్లిగ్రామంకు చెందిన .కొండరాజు రత్తయ్య(29),తిరుపతి బండ్లవీదికి చెందిన కందన్‌సాయి(28)లను అరెస్టుచేశారు.వీరిపై కూడా కడప,నెల్లూరు, కార్వేటినగరం,గాజులమండ్యం పుత్తూరులో పాతకేసులు ఉన్నాయి. ఆర్టీసి బస్టాండులో ప్రయాణీకుల్లాగా తోటి ప్రయాణీకులవి ఈ మహిళలు చోరీచేసేవారని తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో చొరవచూపి ప్రతిభ చూపిన క్రైమ్ డిఎస్పీ శ్యామ్ సుందర్, సిఐలు చిన్న పెద్దయ్య, శివకుమార్‌రెడ్డి, ప్రకాశ్‌కుమార్, ఎస్‌ఐలు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, సుభాన్‌నాయక్, క్రైమ్ పార్టీ సిబ్బంది ఎఎస్‌ఐలు మురళి, వెంకటేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుళ్ళు మునిరాజ,విశ్వనాథం, రవిప్రకాశ్, వసంతకుమార్, సిబ్బందిని జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అభినందించి రివార్డులు ప్రకటించారు.

## జిల్లా వ్యాప్తంగా చెకుముకి సంబరాలు

పలమనేరు టౌన్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:



జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శనివారం పాఠశాల స్థాయి చెకుముకి సంబరాలు మిన్నుముట్టాయి. ఇందులో భాగంగా పలమనేరు నార్త పాఠశాలలోనూ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి యుగంధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలోనూ చివరగా ఈ పోటీలు ఉంటాయన్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా దాదాపు 320 పాఠశాలల్లో 8,9,10 తరగతుల విద్యార్థులు 22 వేల మంది ఈ పరీక్షల్లో పాల్గొన్నారని తెలిపారు. చెకుముకిలో ప్రశ్నలు విన్నూత్నంగా విజ్ఞాన దాయకంగా ఆలోచనలు రేకెత్తించే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో గెలుపొందిన ముగ్గురు విద్యార్థులు ఒక టీముగా మండల స్థాయిలో నవంబర్ 1న జరిగే పోటీల్లో పాల్గొంటారు. అలాగే మండల స్థాయిలో గెలుపొందన వారు జిల్లా స్థాయిలో నవంబర్ 23న జరిగే పోటీల్లో పాల్గొంటారు. ఇక జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 12,13,14న మూడు రోజులపాటు జరిగే పోటీల్లో పాల్గొంటారని వివరించారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారికి మెమెంటోలు జ్ఞాపికలు, ప్రశంశా పత్రాలు అందజేస్తామన్నారు. చెకుముకి సంబరాల నిర్వహణలో సహకరించిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## గణనాధుని సేవలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచెర్ల

కాణిపాకం, అక్టోబర్ 18 ప్రభాతవార్త:



ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించు కున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే వారు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, స్థానిక నాయకులు శేషాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇంటి పట్టాలు సత్వరం అందించాలి

\- ఎమ్మెల్యేకు సిపిఐ కార్యదర్శి వినతి

చిత్తూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త



తిరుపతి - బెంగళూరు బైపాస్ రోడ్, తేనెబండ లెక్క దాఖలా ప్రభుత్వ భూమిలో ఇళ్ల నిర్మాణాల కోసం నిరుపేదలు వేసిన పునాదులను జెసిబిల ద్వారా ధ్వంసం చేయడం అన్యాయమని జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. పేదలకు ఇదివరకు కేటాయించిన ఇళ్ల స్థలాలకు సంబంధించి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని శనివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను కలసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఇదివరకు తేనెబండ లెక్క దాఖలాలోని ప్రభుత్వ భూమిలో ఎస్సీ,ఎస్టీ, బిసి,మైనార్టీలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారని ఆమేరకు కొంతమంది అక్కడ ఇళ్ల నిర్మాణాలకు పునాదులు వేసుకున్నారన్నారు. అయితేప్రస్తుతం అధికారులు ఇతర ప్రాంతంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని పేదలు వేసుకున్న ఇళ్ల పునాదులనుజెసిబిలతో ధ్వంసంచేస్తున్నారన్నారు. దీనిపై జోక్యం చేసుకుని అర్హులైన నిరుపేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలం కేటాయింపుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఇరికిపెంట వద్ద రోడ్డు ప్రమాదం



**సోమల అక్టోబర్ 18 (ప్రభాతవార్త)** పుంగనూరు తిరుపతి మార్గంలో ఇరికిపెంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పంచాయతీ చెన్నయ్య గారి పల్లి దళితవాడకు చెందిన గంగాధర్ శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంలో పుంగనూరు వైపు వెళ్ళాడు. అదే క్రమంలో పుంగనూరు నుంచి సోమల వైపు వస్తున్న కారును మోటార్ సైకిల్ వేగంగా ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ఘటనా స్థలంలోని గంగాధర్ మృతి చెందాడు. తలకు తీవ్ర గాయం కావడంతో ఆయన మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై శివశంకర్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## అండర్ 17 అండర్ 14 బాలబాలికల కబడ్డీ జట్టుకు ఎంపిక



**సదుం, అక్టోబర్ 18 ప్రభాతవార్త** ఈనెల 17న చౌడేపల్లి మండలం చారాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పలమనేర్ డివిజన్ స్థాయి అండర్ 17 బాలుర మరియు అండర్ 14 బాలికల కబడ్డీ జట్లకు సదం జిల్లా పరిషత్ పాఠశాల చెందిన పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ 17 బాలుర కేటగిరిలో పదవ తరగతి విద్యార్థులు సుజిత్ మహేంద్ర నాయుడు, ధరణి, అండర్ 17 బాలికల కేటగిరిలో పదవ తరగతి విద్యార్థి జాహ్నవి ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. అదేవిధంగా 14 బాలుర కేటగిరిలో 9వ తరగతి విద్యార్థి తులసి, అండర్ 14 బాలికల కేటగిరిలో 8వ తరగతి విద్యార్థి యోగ శ్రీ ,ఆరో తరగతి విద్యార్థి లిఖిత ఎంపికైనట్లు ఆయన చెప్పారు. వీరిని శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు మరియు వ్యాయామ ఉపాధ్యాయులు నౌషద్ ఆలీ భాస్కర్ తదితరులు అభినందించారు.

## నూతన కోర్టుకు స్థలం పరిశీలన



**సత్యవేడు, అక్టోబరు 18 ప్రభాతవార్త:** సత్యవేడు మండలంలో శనివారం మధ్యాహ్నం సత్యవేడు మండల కేంద్రానికి చేరుకున్న జిల్లా న్యాయమూర్తి అరుణ సారిక, సత్యవేడు సివిల్ జూనియర్ కోర్టు న్యాయమూర్తి వెంకట నాగరాజుతో కలసి కొత్త భవన నిర్మాణం కొరకు స్థలాలను పరిశీలించారు. ఇందులో భాగంగా మొదటిగా మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని కరోనా సమయంలో నిర్మించిన కొత్త భవనాన్ని పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణం కావడంతో ప్రజల అనుకూలం కొరకు ఆ ప్రాంతాన్ని కోర్టుకు వాడుకోవడానికి జిల్లా న్యాయమూర్తి నిరాకరించారు. దానిని అనుసరించి మండల కేంద్రంలోని స్పోర్ట్స్ అథారిటీ వారి ఇండోర్ స్టేడియంలో పరిశీలించారు. తాత్కాలికంగా భవన నిర్మాణం వరకు ఇప్పుడున్న కోర్టును ఇక్కడకు మార్చడానికి అంగీకరించారు. అనంతరం నూతన కోర్టు భవనం నిర్మాణం కొరకు స్థానిక తహసీల్దార్ రాజశేఖర్‌తో కలసి ప్రస్తుతం కాయకూరల సంత నిర్వహిస్తున్న సర్వే నెం.274-1లోని 3.5 ఎకరాల భూమిని పరిశీలించి ఆమోదించారు. జిల్లా న్యాయమూర్తి అరుణసారిక ఆర్అండ్‌బీ ఎస్సీ రాజా నాయక్ వద్ద కొత్తగా నిర్మించనున్న మూడు అంతస్తుల కోర్టు భవన నిర్మాణాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని సబ్‌జైలును పరిశీలించారు. అక్కడి స్థితిగతులను గురించి న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మురళీనాయుడు, ఎస్ఐ రామస్వామి, న్యాయవాదుల భారతదేశం ఛైర్మన్ వెంకటేశ్వరులు, కోశాధికారి జాన్, సీనియర్ లాయర్లు మధు, ఆర్అండ్‌బీ డీఈ అమర్‌నాథ్, ఇజ్రాయిల్, పలువురు ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపిన హోటల్ అసోసియేషన్



**తిరుపతి విద్య అక్టోబర్ 18 ప్రభాత వార్త:** తిరుపతి జిల్లా నూతన ఎస్పీగా నియమితులైన సుబ్బరాయుడును శనివారం తిరుపతి హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.తర్వాత పూల బొకే ను అందించారు.ఈ సందర్భంగా ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవి చౌదరి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు గతంలో ఇక్కడ పనిచేసిన సందర్భంగా తిరుపతి భద్రతపై తీసుకున్న చర్యలను వారు అభినందించారు.దీపావళి పండుగ పోలీస్ సిబ్బంది ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.శాంతి భద్రతలు కాపాడడంలో జిల్లా ఎస్పీ పాత్ర అమోఘమని కొనియాడారు.తిరుపతి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. తిరుపతి హోటల్స్ అసోసియేషన్ నేతలు చిల్లీస్ అంజి, రిగాలియా హోటల్ నితిన్ చక్రవర్తి,లోకేష్, కుమారస్వామి రెడ్డి, వంశీ కృష్ణ రెడ్డి,ఒరియన్ శ్రీనివాస్,గ్రీన్ మెరీడియన్ చంద్రశేఖర్ ఇతర హోటల్ యాజమానులు పాల్గొన్నారు.

## తుమ్మలగుంటలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ భారత్'

తిరుపతిరూరల్, అక్టోబర్18 ప్రభాతవార్త:



తుమ్మలగుంట గ్రామ పంచాయతీలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని శనివారం టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం సంయుక్త కార్యదర్శి బిరుదాల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లును, గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే స్వర్ణాంధ్ర-స్వచ్ఛ భారత్' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెయ్యాల వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ గోపాల్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

## ఏరియా ఆస్పత్రిలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

కుప్పం,అక్టోబర్ 18 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్నిశనివారం కుప్పం ఏరియా ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో 1400 మొక్కలు నాటారు. డిప్యూటీ డిఎంహెచ్ఓ గంగాదేవి, ఎంఎస్ విజయకుమారి, బిజెపి ఇన్‌చార్జ్,రెస్కో డైరెక్టర్ తులసినాథ్‌లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ ్బంది పాల్గొన్నారు.

## వైకాపాను వీడి తెదేపాలోకి 35 కుటుంబాలు చేరిక



**కుప్పం, అక్టోబర్ 18 ప్రభాతవార్త** మండలంలోని టి. సదుమూరు పంచాయతీ శింగారపురంకు చెందిన 35 కుటుంబాలు శనివారం ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు రాజ గోపాల్‌ల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సిఎం చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు బాగున్నాయని తాము తెదేపాలో చేరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సా ంబశివ ం, కడ సభ్యుడు రామచంద్ర, నేతలు చంద్ర, మోహన్, ఆర్ముగం, ప్రకాష్, విభూషణ్, సంపత్,యువరాజ్, మహేంద్ర, శేఖర్, సంధ్య, మునస్వామి పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపాలి



\- ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, అక్టోబర్ 18 ప్రభాతవార్త

కుప్పం ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులుమక్కువ చూపాలని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంపేర్కొన్నారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఎపిసిఎన్ఎఫ్ అధ్వర్యంలో రైతులతో ముఖా ముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు కుప ్పం నియోజకవర్గంలో రైతులు బాగుండాలనే దిశగా ఆలోచనలు చేస్తున్నారన్నారు. అందుకు గాను ఇదివరకే కృష్ణాజలాలు తీసుకువచ్చారన్నారు. ఇది భగీరథ ప్రయత్నం అన్నారు. మరో పక్క వర్షపు నీరు ఒడిసి పట్టేందుకు పాలారు నది చెక్‌డ్యాముల మరమ్మత్తులు సైతం చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు కూడా పాత పద్ధతిలో పంటల సాగు చేయడం తగ్గించుకుని ఖర్చు తగ్గే, దిగుబడి వచ్చే పంటల సాగు వైపు మొగ్గు చూపాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఎలాంటి రసాయనిక ఎరువుల వాడకం ఉండ దన్నారు. ప్రకృతి వ్యవసాయంలో కుప్పం ప్రాంతం ఆదర్శంగా మారేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, కుప్పం ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, ఉద్యానశాఖ ఎడి పల్లవి, ఎఎంసి డైరెక్టర్లు, వ్యవసాయ, పట్టుపరిశ్రమ అధికారులు,రైతులు పాల్గొన్నారు.

## పండగ సందర్భంగా అదనంగా మెమూ రైళ్లు

కుప్పం, అక్టోబర్ 18 ప్రభాతవార్త

దీపావళి పండగ సందర్భంగా బెంగళూరు - కుప్పం, బెంగళూరు - జోలార్ పేట మధ్య అదనంగా మెమూ ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే ఉన్నతాధికారులు నిర్ణయించారు. ట్రైన్ నెం 06214 జోలార్ పేట- కెఎస్ఆర్ బెంగళూరు, ట్రైన్ నెం 66530,66531 కుప్పం - కెఎస్ఆర్ బెంగళూరు మధ్య ఈనెల 23వతేది వరకు నడపాలని నిర్ణయించారు.

## చెరువులో పడి వ్యక్తి ఆత్మహత్య

కుప్పం, అక్టోబర్ 18 ప్రభాతవార్త



స్థానిక డికెపల్లి చెరువులో పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు అర్బన్ సిఐ శంకరయ్య తెలిపారు. సిఐ తెలిపిన మేరకు వివరాలిలా.. మోడల్ కాలనీకి చెందిన హరిబాబు (50)కు ఇదివరకే వివాహం అయి భార్యభర్తలు విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారన్నారు. ఓపక్క అనారోగ్య సమస్యలు, మరో పక్క జీవితంపై విరక్తి చెందిన హరిబాబు డికెపల్లిచెరువులోపడిఆత ్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## సిఎం చంద్రబాబును కలసిన కుప్పం నేతలు



కుప్పం, అక్టోబర్ 18 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడును టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారా ం, కుప్పం రెస్కో ఛైర్మన్ విజి ప్రతాప్ కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాంతారాం సిఎంకు శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. రెస్కో ఛైర్మన్ ప్రతాప్ రెస్కో పరిధిలో చేపట్టే కార్యక్రమాలపై సిఎంకు వివరించారు. ఈసంద ర్భంగా సిఎం చంద్రబాబు కుప్పంలో అభివృద్ధి పనులపై అడిగి తెలుసుకున్నట్లు వారు తెలిపారు.

## యువతి అదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు

శాంతిపురం, అక్టోబర్ 18 ప్రభాతవార్త

మండలంలోని అబకలదొడ్డిపంచాయతీ వెంకటేష్‌పురంకు చెందిన భువనేశ్వరి (20) కన్పించడం లేదని ఆమె తండ్రి బాలకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకుమార్తె డిప్లమో పూర్తిచేసుకుని పలమనేరులోని కంప్యూటర్ సెంటర్‌లో కంప్యూటర్ కోర్సు చదువుకుంటూ హాస్టల్‌లో ఉండేదన్నారు.ఈనెల 11న తాము ఆమెను తమ ఇంటికి తీసుకువచ్చామన్నారు. ఈనెల 17వతేది మధ్యాహ్నం నుంచి భువనేశ్వరి కన్పించకపోగా చుట్టుపక్కల గాలించడంతో పాటు బంధువులను సైతం కనుక్కొన్నామన్నారు. అయితే ఆమె జాడ తెలియరావడం లేదన్నారు. తమ కుమార్తె ఆచూకీ కనుగొనాలని కోరాడు.

## యూనస్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

పలమనేరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త:



కల్యాణి రేవులో గల్లంతై మృతిచెందిన యూనస్ కుటుంబ సభ్యులను పలమనేరు ఎమ్మెల్యే అమర నాథరెడ్డి పరామర్శించారు. శనివారం సాయంత్రం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్ష గది వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇది దురదృష్టకర సంఘటన అని పిల్లల పట్ల తల్లి దండ్రులు తగిన జాగ్రత్తలు చూపాలని ఎక్కడ వెళుతున్నారో, ఏం చేస్తున్నారో గమనిస్తూ ఉండాలని సూచించారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాలని ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. పిల్లలు ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదని అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. తల్లిదండ్రులు రేయింబవళ్ళు కష్టపడి సంపాదించేది పిల్లల కోసమేనని చివరకు అకాల మృత్యువుతో పిల్లలు కడుపుకోత మిగులుస్తున్నారని ఆవేదన వ్యకం చేశారు. పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లె మండలం కైగల్లు జలపాతం, పలమనేరు రూరల్ మండలం కల్యాణిరేవు, గంగన్న శిరస్సు జలపాతాలు ప్రమాదకరమైనవని పైగా వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటాయని హెచ్చరించారు. పిల్లలు తమ తల్లిదండ్రులతో కలిసి వెళ్ళి దూరం నుండి చూడాలని జలపాతంలో దిగి ప్రమాదాలు కోరి తెచ్చుకోవద్దని సూచించారు. ఈ జలపాతాల వద్ద భద్రతా చర్యలు చేపట్టడానికి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు.

## ఆకతాయిల మాయ మాటలకు లొంగకండి : న్యాయమూర్తి



పలమనేరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త:

కొత్తగా పరిచయమయ్యే అకతాయిల మాయ మాటలకు లొంగవద్దని న్యాయమూర్తి లిఖిత అన్నారు. పలమనేరు మండల న్యాయసేవా అధికార సంస్థ ఛైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి వావిలి ఆది నారాయణ ఆదేశాల మేరకు శనివారం గంగవరం మండలం జిఎల్ఎస్ ఫామ్ హైస్కూల్‌లో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జూనియర్ సివిల్ జడ్జి లిఖిత మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు ఖచ్చితంగా విద్యను అభ్యసించాలని తెలిపారు. యూ ట్యూబ్‌లు, ఫేస్ బుక్‌లతో పాటు కొత్తగా పరిచయమైన వారితో సన్నిహితంగా మెలగవద్దని హెచ్చరించారు. కేవలం చదువు మీదనే దృష్టి సారించాలని ఇతర దురలవాట్లతో బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ భాస్కర్, సీనియర్ న్యాయవాది ఆరీఫుల్లాఖాన్, ఎంఇఓ వేణుగోపాల్‌రెడ్డి, హెచ్ఎం విజయకుమార్, ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ ధన్వంతరి భగవాన్ జయంతి ఉత్సవాలు

పెద్దపంజాణి,అక్టోబర్ 18 ప్రభాతవార్త

స్థానిక నాయీ బ్రాహ్మణసేవా సంఘం అధ్వర్యంలో శనివారం శ్రీ ధన్వంతరి భగవాన్ జయంతి ఉత్స వాలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం హాజర య్యారు. ఈసందర్భంగా భగవాన్ చిత్రపటానికి పూజ లు నిర్వహించి ఉత ్సవాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు చలపతి, ఉపాధ్యక్షుడు బాలా జీ,చెన్నకేశవులు, సూర్యనారాయణ,రవి, మునిరత్నం,సుబ్రమణ్యం, శ్రీనివాసులు,దిలీప్, జితేం ద్ర

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## విద్యుత్ స్థంభాన్ని ఢీకొన్న కారు

\-తప్పిన ప్రమాదం

చౌడేపల్లి, అక్టోబర్ 18 ప్రభాతవార్త



విద్యుత్ స్థంభాన్ని కారు ఢీకొని బోల్తా పడి ఎలాంటి ప్రమాదం సంభవించకుండా పోయిన సంఘటన శనివారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. కర్ణాటక రాష్ట్రం కోలారుకు చెందిన కొందరు భక్తులు అమ్మవారి దర్శనానికి కారులో వచ్చారు. దర్శనానంతరం స్వగ్రామానికి తిరుగుముఖం పట్టారు. చౌడేపల్లి-బోయకొండ ప్రధాన రహదారిలో వస్తుండగా మార్గమధ్యంలోని అట్లవారిపల్లి ఆంజనేయస్వామి ఆలయం వద్ద కారు విద్యుత్ స్థంభాన్ని ఢీకొని పొలంలోకి బోల్తా పడింది. కాగా కారులో వున్నవారికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. దీంతో చుట్టుపక్కల వారు ఊపిరి పీల్చుకొన్నారు.

## " పిట్ట కొంచం కూత ఘనం "

\-ప్రతిభ కనబరచిన బాలుడు

చౌడేపల్లి, అక్టోబర్ 18 ప్రభాతవార్త



పిట్టకొంచంకూతఘనం అన్న చందంగా బాలుడు చిన్నతనం నుంచి విద్యతోపాటు ఇతరత్రా పోటీల్లో రాణిస్తూ అందరి మన్నలను పొందుతున్నాడు. మండలంలోని ఆమినిగుంట పంచాయతీ శింగిరిగుంటకు చెందిన ఎన్.బాలకుమార్ కుమారుడు ఎన్.శివశంకరవరప్రసాద్ సదుం గురు కుల పాఠశాలలో 9వ.తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలుడు మొదటి స్థానంలో నిలచాడు. దీంతో అతనికి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి, ఎఎస్ఐ సత్యనారాయణలు ప్రోత్సాహక బహుమతి, ప్రశంసా పత్రాన్నందించారు.

## కన్నుల పండుగలా అయ్యప్పస్వామికి పడిపూజ

చౌడేపల్లి, అక్టోబర్ 18 ప్రభాతవార్త



మండలంలోని పలు ప్రాంతాల్లో అయ్యప్ప స్వామి పడిపూజ, కన్యపూజలను కన్నుల పండుగలా నిర్వహించారు. గోసలకురపల్లి, చిట్రెడ్డిపల్లిల్లో గురుస్వామి కన్నయ్యచే పలు పూజా కార్యక్రమాలు జరిగాయి. వినాయక, సుబ్రమణ్యం, అయ్యప్పస్వామి చిత్రపటాలకు అంబలాన్ని ఏర్పాటు చేసారు. అయ్యప్ప మాలధారణతో వున్న భక్తులు కీర్తనలు చేస్తూ పూజలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసారు.

## ఆయుర్వేద మూలపురుషుడు శ్రీధన్వంతరి భగవాన్ జయంతి వేడుకలు

చిత్తూరురూరల్, అక్టోబరు 18 ప్రభాతవార్త:



ఆయుర్వేద మూలపురుషుడు శ్రీ ధన్వంతరి భగవాన్ జయంతి వేడుకలను 37వ డివిజను నాయిబ్రా హ్మణ సేవాసంఘం అధ్యక్షుడు ప్రసాద్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిధులుగా బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు, సెంట్రల్ మండల అధ్యక్షులు 37వ డివిజన్ బిజెపి ఇన్‌ఛార్జీ జి షణ్ముగం పాల్గొని ప్రపంచ మానవాళికి ఆయుర్వేద జ్ఞానాన్ని అందించిన ధన్వంతరి భగవాన్ ఆయుర్వేద వైద్యదేవుడు జయంతిని నాయిబ్రాహ్మణ సోదరులు ఘనంగా నిర్వహించడం విశేషమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సంఘనాయకులు మోహన్, వెంకటరమణ, రమేష్, సెంట్రల్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## శుచి శుభ్రతతో కూడిన భోజనాన్ని భక్తులకు అందించాలి

కాణిపాకం, అక్టోబర్ 18 ప్రభాతవార్త:



కాణిపాకం దేవస్థానం అన్నదాన భవన్‌లో భక్తులకు వడ్డించే అన్నప్రసాదం శుచి శుభ్రతతో వుండాలని ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ సిబ్బందికి సూచించారు. దేవస్థానం నూతన అన్నదాన భవన్‌ను ఆలయ అధికారులు, భక్తులతో కలసి ఈఓ పెంచల కిషోర్ అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన అన్నప్రసాదం నాణ్యత, రుచిపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు నాణ్యమైన శుచి శుభ్రతతో కూడిన భోజనాన్ని వడ్డించాలని సూచించారు. అలాగే అన్నదాన భవన్‌ను పరిశుభ్రంగా వుంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ధనుంజయ, రవీంద్రబాబు, ఎస్వీ,కృష్ణారెడ్డి, ప్రసాద్, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

## తవణంపల్లె డిప్యూటీ ఎంపీడీఓగా రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ

తవణంపల్లె, అక్టోబర్ 18 ప్రభాతవార్త:

మండల డిప్యూటీ ఎంపీడీఓగా రాజశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత జూలై నెల నుండి మండలంలోని రెగ్యులర్ డిప్యూటీ ఎంపీడీఓ లేకపోవడంతో అరగొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి మురుగేశన్ ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీఓగా కొనసాగుతున్నారు. ఈనేపథ్యంలో పెద్దపంజాణి ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్‌ను పదోన్నతిపై తవణంపల్లె డిప్యూటీ ఎంపీడీఓగా ప్రభుత్వం నియమిస్తూ ఉత్వర్వులు జారీ చేసింది, ఈమేరకు ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో గ్రామాల సర్వతోముఖాభివృద్దికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## పీఎం జన్ ఆరోగ్య యోజన లక్ష్యాలను పూర్తి చేయాలి

తవణంపల్లె, అక్టోబర్ 18 ప్రభాతవార్త:



ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి వయో వందన యోజన కార్యక్రమాలకు సంభందించి మండలానికి నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం పూర్తి చేయాలని ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ చిత్తూరు జిల్లా కో.ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ ఆదేశించారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి వయో వందన యోజన కార్యక్రమాలకు సంభందించి మండల వైద్య, ఆరోగ్య అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీక్ష అనంతరం నిర్దేశించిన లక్ష్యాలనను సకాలంలో వందశాతం పూర్తి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞాన శేఖర్, సూపర్‌వైజర్లు రెడ్డెమ్మ, గోపి, ఆరోగ్య కార్యకర్త సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు నారాయణ విద్యార్థులు

కుప్పం,అక్టోబర్ 18 ప్రభాతవార్త



చం ద్రగిరిలో జరిగిన జిల్లా స్థా యి హాకీ పోటీల్లో రాణించిన కుప్పం నారాయణ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, పిఇటిలు మురళి, విజయ్ తెలిపారు. తొమ్మిదో తరగతి చదువు తున్న తనీష్ చౌదరి, సుఫియాన్‌లు అండర్ -14 విభాగంలో రాష్ట్రజట్టుకు ఎంపికై నట్లు చెప్పారు. విద్యార్థులను డిజిఎం కొండలరావు, ఎజిఎం ఫణికుమార్, ప్రసాద్, మునిరెడ్డి, విఘ్నేష్,బాలకృష్ణ, నరేష్, ప్రదీప్, ఉపాధ్యాయులు అభి నందించారు.

## జీవితాల్లో వెలుగు నింపేదే...దీపావళి పండగ

**తిరుపతి, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** చీకటిని పారద్రోలి... జీవితాల్లో వెలుగు నింపేదే దీపావళి పండగని ఆర్.కె. ఇన్‌స్టిట్యూషన్స్ ఛైర్మన్ డాక్టర్ ఆర్కే రెడ్డి తెలిపారు. శనివారం ఆర్.కె. గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో దీపావళి పండగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దీపాలంకరణలు, సాంస్కృతిక ప్రదర్శనలు, పాటలు, నృత్యాలతో అందరిని అలరించారు. జ్ఞానం అనే దీపాన్ని వెలిగించి, తమ భవిష్యత్‌ను ప్రకాశవంతంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్కే ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ ఆర్కే విమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## రాష్ట్ర ఐటి అకాడమి వారిచే శిక్షణా తరగతులు



సూళ్లూరుపేట, అక్టోబర్ 18 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీగోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమి వారి ఆధ్వర్యంలో నంది ఫౌండేషన్ వారి సహకారంతో గోకుల కృష్ణ విద్యార్థులకు వారంరోజులు పాటు శిక్షణా తరగతులను నిర్వహించారు. శనివారం శిక్షణా తరగతులు ముగింపులో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి నంది ఫౌండేషన్ కోఆర్డినేటర్ పవన్‌శర్మ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలు ఎలా సంపాదించాలి, ఆ ఉద్యోగాలను సమర్థవంతంగా ఎలా నిర్వర్తించాలి అనే అంశాలపై స్కిల్స్ పెంపొందించుకునేందుకు వారంరోజులు పాటు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఎంపాలిబిలిటి స్కిల్స్‌ను, ముఖ్యంగా విద్యార్థులు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, డెసిషన్ మేకింగ్ స్కిల్స్ మీద విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇది ఆర్ అండ్‌బి రోడ్డేనా..!



కోట, అక్టోబర్ 18 ప్రభాతవార్త: మండల విద్యా నగర్‌లోని ప్రకాశంకాలనీ ఎదురుగా ఆర్అండ్‌బి రహదారి మధ్యలో రెండు అడుగుల గుంతలో 30 మీటర్ల వెడల్పు బావిని తలపించే విధంగా రోడ్డు తయారైంది. తేలికపాటి వర్షానికే రోడ్డు మధ్యలోని గుంటలో నీళ్ల నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ గుంట ఎంత లోతు ఉందో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. పలు వాహనాలు నీళ్లలోకి దిగబడి పోతున్నాయి. దీనికితోడు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాహన చోదకులు ఆందోళనకు గురవుతున్నారు. ఆ గుంటను తాత్కాలికంగా అయినా పూడ్చేందుకు ప్రయత్నించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఎమ్మెల్యేచే సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



గూడూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గూడూరు నియోజకవర్గంలో సీఎం సహాయ నిధి నుండి రెండు కోట్ల 75 లక్షల రూపాయలు పేద ప్రజలకు ఇవ్వడం జరిగిందని పార్టీల కతీతంగా సీఎం సహాయనిధి అందించామని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 55 మందికి సీఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అందజేశారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ 75 మందికి 35 లక్షల 97 వేల 820 రూపాయలు సహాయ చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో ఒక్కరికి కూడా సీఎం సహాయనిధి రాలేదని గుర్తు చేశారు. మండల నాయకులు తమ ప్రాంతంలో ఎవరైనా పేద ప్రజలు ఆరోగ్య నిమిత్త ఇబ్బంది పడుతుంటే వారిని గుర్తించి తెలియజేయాలని పార్టీలకతీతంగా ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని వెల్లడించారు.నాయకులు కిరణ్ కుమార్ భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, రహీం, రాజశేఖర్ మధురెడ్డి మనోజ్‌రెడ్డి, కిషోర్ నాయుడు, పట్టాభి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్, షార్‌లచే అన్నదానం



సూళ్లూరుపేట, అక్టోబర్ 18 ప్రభాతవార్త : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ వారి ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీనివాసరావు, భారతి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రీజియన్ సెక్రటరి ఆదిశేషారెడ్డి, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు లలిత, అరుణకుమారి, కోశాధికారి జానకి సారథ్యంలో ఈ కార్యక్రమం జరగ్గా, లయన్స్ క్లబ్ సభ్యులు రఘురామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాధాకృష్ణారావు, శ్రీనివాసులు జెట్టి, అప్పారావు, హరినారాయణరెడ్డి, హరీష్, పిజెసి రెడ్డి, అంకుల్‌రావు, సురేష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

సూళ్లూరుపేట, అక్టోబర్ 18 ప్రభాతవార్త: నవజీవన్ ఆర్గనైజేషన్, సిసిపియు ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం స్థానిక విఎస్‌ఎస్‌సి హోలీక్రాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చిన తర్వాత ఎలా అధిగమించాలనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం శ్రీలత, ప్రధానోపాధ్యా యురాలు ఎ.షీలా, ఉపాధ్యాయులు మేరీ, అలేఖ్య, వెంకటేశ్వర్లు, ఓఆర్‌డబ్ల్యులు మంజుల, నందిని తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ వెస్ట్ క్లబ్‌చే క్యాన్సర్ అవగాహనా సదస్సు



గూడూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా, గూడూరు డిఆర్‌డబ్ల్యూ కాలేజీలో శనివారం రోటరీ వెస్ట్ క్లబ్, గూడూరు ఆధ్వర్యంలో నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ సహకారంతో క్యాన్సర్ అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ వెస్ట్ క్లబ్ విద్య, వైద్యం పైన ఎక్కువ కార్యక్రమాలు చేస్తుంటామని, అందులో భాగంగా క్యాన్సర్ అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్ సాయి రూప మాట్లాడుతూ ఆహారం అలవాటు మార్పు చేసుకోవాలని, ఆరోగ్యం సరిగా లేనప్పుడు నిర్లక్ష్యం చెయ్యకుండా డాక్టర్ సలహా తీసుకోవాలని, షుగర్, బిపి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రాఘవ రెడ్డి, ఎల్లసిరి గోపాల్ రెడ్డి, రామ్ మోహన్ రావు, బొమ్మిడి శ్రీనివాసులు నాసిన నాగులు, సిహెచ్ గిరిబాబు, సూర్య ఫ్యాన్సీ సుబ్రహ్మణ్యం, సనత్ రెడ్డి, రాజ శేఖర్ రెడ్డి, నవీన్ జయ కుమార్, ప్రిన్సిపాల్ హనుమంత రావు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర



సూళ్లూరుపేట, అక్టోబర్ 18 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మున్సిపాలిటీ ఆధ్వర్యంలో క్లీన్ ఎయిర్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మొక్కలు నాటడం, డివైడర్లు, కాలి బాటల్లో ఉన్న పిచ్చిమొక్కలు తొలగించడం, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం వంటివి చేపట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వ హైస్కూలు, తేజా హై స్కూలులో మొక్కలు నాటారు. కమిషనర్ కె.చిన్నయ్య మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించేందుకు మోటార్‌బైకులకు బదులు సైకిళ్లను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా, మున్సిపల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, శానిటరి సెక్రటరిలు పాల్గొన్నారు.

## ఘనంగా అలవల సురేష్ జన్మదిన వేడుకలు



సూళ్లూరుపేట, అక్టోబర్ 18 ప్రభాతవార్త: పట్టణ వైసీపీ సీనియర్ నేత అలవల సురేష్ జన్మదిన వేడుకలను శనివారం ఆ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌ను ఘనంగా సన్మానించి బర్త్‌డే కేకును కట్ చేసి పంచిపెట్టారు. వైసీపీ నేతలు జెట్టి వేణుయాదవ్, చిన్ని సత్యనారాయణ, మీజూరు రామకృష్ణారెడ్డి, కృపాకర్‌రెడ్డి, చిలకా యుగంధర్, బాబురెడ్డి, భగవాన్‌దాస్, బద్దెపూడి మోహన్‌రెడ్డి, సురేష్, రాజశేఖర్, వంకా దినేష్, హుస్సేన్, మలిరెడ్డిలు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడాలి

కోట, అక్టోబర్ 18 ప్రభాతవార్త: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. ఎంపిడిఓ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, మంచి వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలను నాటాలని కోరారు. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవనం కోసం మొక్కలను నాటి సంరక్షించాలని, అప్పుడే స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛాంధ్ర దిశగా ముందుకు వెళతామని చెప్పారు. వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించి ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచడం అలవాటు చేసుకోవాలన్నారు. దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో టపాసుల వలన కలిగే అనర్థాలను తగ్గించాలన్నారు. పర్యావరణ హితమైన దీపాలు, కొవ్వొత్తులను ఉపయోగించాలని, కాలుష్యం నివారణ దిశగా ప్రజలు ముందుకు వెళ్లాలని కోరారు. అలాగే ప్రభుత్వ వసతిగృహాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## రైతులకు యూరియా పంపిణీ చేసిన ఎమ్మెల్యే

గూడూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ కార్డులను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా రైతులకు అందజేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రైతులకు యూరియా సరఫరా కార్డులను రైతులకు అందజేశారు. వ్యవసాయ శాఖ ఏడి మాట్లాడుతూ యూరియా కావలసినంత నిల్వ ఉందని రైతులెవరు ఆందోళన చెందవద్దని ఇప్పుడు ఇచ్చినటువంటి కార్డులను చూపించి యూరియాని రైతులు కొనుగోలు చేయాలని సోమవారం నుండి రైతులందరికీ వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా కార్డులను అందజేస్తామని ఎవరు ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, రహీం, ఇజ్రాయిల్, మట్టం శ్రావణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దుకాణదారులతో అధికారుల సమావేశం

కోట, అక్టోబర్ 18 ప్రభాతవార్త: దీపావళిని పురస్కరించుకుని టపాసుల దుకాణ దారులతో కోట తహశీల్దార్ కార్యాలయంలో శనివారం తహశీల్దార్ కె.జయజయ రావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రతి దుకాణానికి మధ్య మూడు మీటర్లు దూరం ఉండాలని కోరారు. అనుకోకుండా విపత్తు చోటు చేసుకుంటే మంటలను ఆర్పేందుకు నీళ్లు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ పవన్‌కుమార్, దుకాణదారులు పాల్గొన్నారు.

## తడ విద్యాశాఖ ఆధ్వర్యంలో క్లస్టర్ సమావేశం

తడ, అక్టోబర్ 18 ప్రభాతవార్త: తడలో ప్రతి మూడో శనివారం జరిగే క్లస్టర్ సమావేశాలు ఈ శనివారం కూడా నిర్వహించారు. తడ మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వాటంబేడు క్లస్టర్లలో జరిగిన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్రశిక్షా అదనపు కోఆర్డినేటర్ తిరుపతి గౌరీశంకర్, శివశంకర్, సారథి, మండల విద్యాశాఖ అధికారులు జెకె వేముల, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో సత్తా చాటుతున్న విద్యార్థులు



గూడూరు రూరల్, అక్టోబర్ 18 ప్రభాతవార్త: మున్సిపల్ పరిధిలోని చెన్నూరు గ్రామంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ రాష్ట్రస్థాయిలో తమ సత్తా చాటుతున్నారు. అండర్ 14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి ఎన్.మోహిత్ బీచ్ వాలీ బాల్ లోను, 6వ తరగతి విద్యార్థులు వి.సుధీర్, ఎస్. చెంచయ్య, స్విమ్మింగ్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైయ్యారు. 10వ తరగతి విద్యార్థి ఎన్. చరణ్ అండర్ 19 విభాగంలో బాక్సింగ్లో రాష్ట్రస్థాయికి ఎంపికైయ్యారు. అండర్ 17 కబడ్డీలో ఎన్ చరణ్ పదవ తరగతి మండలంలో ద్వితీయ స్థానం సాధించి, డివిజన్స్ స్థాయిలో పాల్గొన్నారు. అండర్ 14 విభాగంలో మండల స్థాయికి వాలీబాల్ లో ఎన్ మోహిత్ ఎంపికైయ్యారు. సిహెచ్. దినేష్ 9వ తరగతి, అండర్ 17 వాలీబాల్‌లో డివిజన్ స్థాయిలో ఉత్తమప్రదర్శనను కనపరిచారు. మండల డివిజన్ స్థాయి చదరంగంలో ఒకటి ప్రదర్శన కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనాడు ఇటీవల అకాడమీ వారు డిఆర్ డబ్ల్యు కళాశాలలో నిర్వహించిన చదరంగం పోటీల్లో ఓ చరణ్ తేజ 8వ తరగతి విజేతగా నిలిచాడు. ప్రధానోపాధ్యాయు రాలు టి.బాల నాగమ్మ మాట్లాడుతూ ఇంత చక్కగా తీర్చేదిద్దినందుకు ఫిజికల్ డైరెక్టర్ ఎస్.కె జమిలాని, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పేరెంట్స్, స్కూల్ కమిటీ మెంబర్స్‌లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకి ఘన సన్మానం



గూడూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త: పట్టణంలోని గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ నివాసంలో శనివారం తూర్పు కనుపూరు నందున్న శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ నూతన చైర్మన్ రెడ్డితో పాటు కమిటీ సభ్యులు కలసి గజమాలతో సత్కరించి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని దీనికి నిదర్శనం. ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ చైర్మన్‌గా కమిటీ సభ్యులుగా మాకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే వాషింగ్ సునీల్ కుమార్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అదే విధంగా పార్టీ కార్యక్రమాలు, ఆలయ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో నవీన్ కుమార్, చైర్మన్ చిల్లకూరు దశరథరామిరెడ్డి, కమిటీ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

## రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా తిరుపతయ్య



గూడూరు రూరల్, అక్టోబర్ 18 ప్రభాతవార్త: గూడూరు వన్ టవున్ ఎస్సైగా పనిచేస్తున్న తిరుపతయ్య గూడూరు రూరల్ పోలీసు స్టేషన్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. రూరల్ ఎస్సై గా పని చేస్తున్న మనోజ్ కుమార్ బదిలీ అయ్యారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు రావడం జరిగింది దీంతో ఇద్దరు ఎస్ఐలకు నాయకులు అభినందనలు తెలిపారు.

## నిబంధనలు, జాగ్రత్తలు పాటించాలి : ఏవో శిరీష



గూడూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త: బాణాసంచా దుకాణం నిర్వహించే వ్యాపారస్తులు ప్రభుత్వ నిబంధనలు, జాగ్రత్తలు పాటించాలని గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో శిరీష వ్యాపారస్తులకు సూచించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓ శిరీష ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు బాణాసంచా దుకాణ వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు అధికారులు పలు సూచనలు తెలియజేశారు తివీ శిరీష మాట్లాడుతూ 22 షాపులకు లైసెన్స్ ఇవ్వడం జరిగిందని దుకాణాల వద్ద నీరు ఇసుక వ్యాపారస్తులు ఏర్పాటు చేసుకోవాలని ధరల బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు పార్కింగ్ వరకు స్థలం ఏర్పాటు చేయడమైందని కొనుగోలుదారులు కూడా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సహకరించాలని కోరారు ఎక్కడ కూడా నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు కానీ అధిక ధరలకు అమ్మడం కానీ జరిగితే ఉపేక్షించేది లేదని వారు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తాసిల్దార్ ప్రసాద్, రూరల్ సీఐ కిషోర్ బాబు, ఎలక్ట్రికల్ ఏఈ ఏడుకొండలు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## పోరుకు సిద్ధం అవుదాం : విస్తృతస్థాయి సమావేశంలో ఎంపి, మాజీ ఎంఎల్ఏ





శ్రీకాళహస్తి, అక్టోబర్ 18 ప్రభాతవార్త: రాష్ట్రంలో ప్రజల్ని మభ్యపెట్టి, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అరాచక పాలనతోజనం విసిగి పోతున్నారని. మనం గ్రామస్థాయి నుంచి పటిష్టమవుదామని తిరుపతి ఎంపి మద్దెల గురుమూర్తి, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎంఎల్ఏ బియ్యపు మధు సూధనరెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం పట్టణంలోని సరస్వతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ స్థాయి విస్తృతస్థాయి సమావేశంను మాజీ శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్‌బుఖన ఆగడాలను డిజిటల్ బుక్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఆరాచకాలపై జగనన్న పిలుపు మేరకు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ప్రజల తరపున పోరుకు గ్రామ, వార్డు, మండల,జిల్లా స్థాయి ఉద్యమాలకు ప్రత్యేక కమిటిలను ఏర్పాటు చేసుకుందామని మధు సూధనరెడ్డి పిలుపు నిచ్చారు. సమావేశానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర వైకాపా ఆర్గనైజింగ్ కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ చట్టాలపై ఉద్యమం ఉధృతం చేయాలని అందుకు గ్రామ,మండల, మున్సిపల్ స్థాయిలో కమిటిల నియామకం ఎంతో అవసరం అన్నారు. వీటిని త్వరగా పూర్తి చేయాలని పిలుపు నిచ్చారు. ఇందుకు అనుబంధాల సంఘాల నాయకులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్‌రెడ్డి, చిత్తూరుజిల్లా ఉమ్మడి ప్రధానకార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్‌బాషా,మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ వయ్యాలకృష్ణారెడ్డి, బర్రె సుదర్శనరెడ్డి, జడ్‌పిటిసి సంధ్యారాణి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూధనరెడ్డి, మండల నాయకులు నియోజకవర్గం నాయకులు హాజరయ్యారు.

## సౌత్ ఇండియా జోనల్ కో ఆర్డినేటర్‌గా నాలి మధుసూదన్



గూడూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త: గూడూరు సౌత్ ఇండియా జోనల్ కో ఆర్డినేటర్‌గా నాలి మధుసూదన్ యాదవ్ ఎంపికైన్నారు. అనంతరం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామీద నమ్మకంతో పదవి ఇచ్చినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## మణికంఠేశ్వరాలయంలో ఘనంగా ప్రదోషకాల పూజ



కాణిపాకం, అక్టోబర్ 18 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంబిగా సమేత మణికంఠేశ్వ రాయలంలో శనివారం ప్రదోషకాల పూజలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా ఆలయంలో త్రయోదశి రోజున ప్రదోష కాల సమయంలో మణికంఠేశ్వరాలయంలో ప్రదోష కాల పూజలను నిర్వహిస్తున్నారు.ఈమేరకు శనివారం సాయం త్రం ఆలయంలో ప్రదోష కాలమందు ఆలయ అర్చకులు వేదపండితులు మంత్రోచ్చారణ నడుమ స్వామివారి మూల విరాట్‌తో పాటు స్వామివారి వాహనం నందికి ఏకకాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతర ం అలంకరించి పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఏఈఓ రవీంద్ర బాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజి నాయుడు, వేదపండితులు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంతోనే స్వచ్ఛగాలి : ఎమ్మెల్యే



చిత్తూరు,అక్టోబర్ 18 ప్రభాతవార్త : మొక్కల పెంపకంతోనే ప్రజలకుస్వచ్ఛమైన గాలి లభిస్తుందని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చిత్తూరులో శనివారం స్వచ్ఛమైన గాలి -ఆరోగ్యవంతమైన జీవనం అంశంపై ర్యాలీ నిర్వహించారు. పివిరెడ్డి కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించేలా ప్రతి ఒక్కరూతగిన జాగ్రత్తలతో దీపావళి పండగను జరుపుకోవాలన్నారు. అనంతరం పివికెఎన్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసినకార్యక్రమంలో మేయర్ అముద, మున్సిపల్ కమీషనర్ నరసింహ ప్రసాద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ లోకేష్‌తో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్టీసీ2డిపో మేనేజర్ రూపశ్రీ, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, అధ్యాపకులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

## తిరుపతిలో బ్లూస్లాజ్ హోటల్ రాక

### -తుడ చైర్మన్ దివాకర్‌రెడ్డి కృషి

తిరుపతి,అక్టోబర్ 18ప్రభాతవార్త: యాత్రాస్థలం తిరుపతిలో పారిశ్రామికంగా పెట్టుబడులు పెట్టి సంస్థ నెలకొల్పేందుకు బ్లూస్లాజ్ హోటల్ ప్రతినిధులు రావడంతో తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి స్వాగతించారు. ఇప్పటికే ఆయన ఇటీవల ఢిల్లీలో జరిగిన అరైజ్ సదస్సులో పాల్గొని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. తిరుపతిలో పెట్టుబడులు పెట్టేందుకు బ్లూస్లాజ్ హోటల్ యాజమాన్యం, ప్రతినిధులు శనివారం వచ్చారు. వీరిని తుడ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి ఆత్మీయంగా స్వాగతించారు. తుడ టవర్స్‌ప్రాజెక్టు అభివృద్ధిలో ముఖ్యమైన పాత్రపోషిస్తోంద న్నారు. తిరుపతి అభివృద్ధి గురించి ఇక్కడ పెట్టుబడులు గురించి వివరించారు. వారినుండి సానుకూలత రావడంతో దివాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడ కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

## సోలార్ ఫ్యానల్‌తో విద్యుత్తు బిల్లులు తగ్గింపు

సత్యవేడు, అక్టోబరు 18 ప్రభాతవార్త: ఇళ్ళపై కప్పుపై సోలార్ ఫ్యానల్స్ ఏర్పాటు వల్ల విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకోవచ్చని తిరుపతి జిల్లా సత్యవేడు మండల పరిషత్ పరిపాలన అధికారి త్రివిక్రమరావు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రారంభంలో తిరుపతి చెల్లాటూరు ఇంజనీరింగ్ ఆటోమిషన్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ ఈశ్వర్ ప్రసాద్ ఆధ్వర్యంలో సోలార్ ఫ్యానల్స్ జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా త్రివిక్రమరావు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల అనేక వస్తువుల ధరలు తగ్గాయన్నారు. ఇళ్ళపై ఏర్పాటు చేసుకునే సోలార్ ఫ్యానల్స్‌పై కూడా జీఎస్టీ తగ్గిందన్నారు. చెల్లాటూరు ఇంజనీరింగ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవితేజ మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంలో సోలార్ ఫ్యానల్ ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు.సమావేశంలో ఎంఈవో రవి, టీడీపీ నాయకులు శివ కుమార్‌నాయుడు, జడేరి బాబు, ధనశేఖర్, చెల్లాటూరు ఇంజనీరింగ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ హరిప్రియ, సోలార్ సాంకేతిక నిపుణులు భార్గవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరునికి వెండీ హస్తాలు బహుకరణ



వడమాలపేట, అక్టోబరు 18 ప్రభాతవార్త: అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి భక్తుడు శనివారం బంగారు తాపడంతో చేసిన వెండీ హస్తాలు బహుకరించారు. తిరుపతికి చెందిన మోహన్, లావణ్య దంపతులు సుమారు రూ.3 లక్షల 50 వేలు ఖర్చు చేసి 1.624 కేజీలు వెండీతో కటి హస్తం, అభయహస్తంలనుపైన బంగారు తాపడంతో తయారు చేసి స్వామివారికి బహుకరించారు. శనివారం ఆలయ అధికారి వేణుగోపాల్‌కు వీటిని అందజేశారు.

## సంస్కృత వర్సిటీలో ఘనంగా ధన్వంతరి జయంతి



తిరుపతి విద్య, అక్టోబర్ 18 ప్రభాతవార్త: ధన్వంతరి జయంతి సందర్భంగా జాతీయ సంస్కృత వర్సిటీలో ఉన్న ధన్వంతరి విగ్రహం దగ్గర యూనివర్సిటీ హెల్త్ సెంటర్ వారిచే పూజా కార్యక్రమం జరిగింది.ముఖ్యఅతిథులుగా ఎన్ఎస్‌యు ఉప కులపతి ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి, స్విమ్స్ కార్డియాలజీ విభాగం ప్రొఫెసర్ ప్రొఫెసర్ వి.వనజాక్షమ్మ, అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల పూజను ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రొ.జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి మాట్లాడుతూ ధన్వంతరి భగవంతుడు ఒక దివ్య వైద్యుడిగా ప్రసిద్ధి చెందారని, ఆయనను విష్ణువు అవతారంగా భావిస్తారని, ఆయుర్వేదం, పురాతన వైద్య శాస్త్రాన్ని మనకు అందించినవారిగా విస్తృతంగా భావిస్తారు, అందువల్ల ఆయనను "ఆయుర్వేద పితామహుడు"గా కృతజ్ఞతతో గౌరవిస్తారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రొ.సత్యనారాయణ ఆచార్య, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, ప్రొ.జె.బలి చక్రవర్తి, సాహిత్య విభాగం, ప్రొ.రాజేష్ మీనా, డా.బి. బాలదత్తాత్రేయ ఎస్.ఎమ్.ఓ, డా.పి.శ్వేత, డా.సి.చిరంజీవి, డా.తపన్ కుమార్ గద్దె యోగవిభాగ అధ్యక్షులు, భిన్నవిభాగాల అధ్యాపకులు,యూనివర్సిటీ హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాస్ ఆధ్వర్యంలో సామూహిక ఆయుధ పూజ



పుత్తూరు, అక్టోబరు 18 ప్రభాతవార్త : రాష్ట్రీయ సేవా సమితి, రాస్ మహిళా క్రాంతి పొదుపు సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని రాస్ కార్యాలయంలో శనివారం భక్తి, శ్రద్ధలతో ఆయుధ పూజ నిర్వహించారు. రాస్ పొదుపు సంఘాల డైరెక్టర్ వి.నాగరాజు సూచన మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయుధ పూజ విశిష్టత, ప్రాముఖ్యత గురించి వివరిస్తూ... పొదుపు సంఘాల రుణాలకే పరిమితం కాకుండా మహిళలు ఆధ్యాత్మిక క్రమశిక్షణ కలిగి వుండాలని వక్తలు తెలిపారు. అనంతరం ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీడర్లు, రాస్ సిబ్బంది వేదాచలం, బాలకృష్ణ, ప్రకాశ్, మునిశేఖర్, పాండురంగన్, మణి, కనకవల్లి, ఉష, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిఎస్టీ అవగాహన ముగింపు కార్యక్రమం : కలెక్టర్

చిత్తూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0ద్వారా తీసుకువచ్చిన సంస్కరణల్లో భాగంగా వినియోగదారులకు కలిగేప్రయోజనాలపై నెలరోజులపాటు జిల్లాలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ-సూపర్‌సేవింగ్స్ కార్యక్రమం ముగింపుసభ ఆదివారం చిత్తూరులో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ధరల తగ్గింపు వివరాలపై ప్రజలకు అవగాహనకల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో సూపర్ జీఎస్టీ -సూపర్‌సేవింగ్స్ ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమం ముగింపు సందర్భంగా చిత్తూరు పివికెన్ డిగ్రీ కళాశాల సమీపంలోని జ్యోతిరావ్ పూలేభవన్‌లో స్టేట్ కమర్షియల్ ట్యాక్స్ అధ్వర్యంలో పండగ వాతావరణంలో వివిధ వాణిజ్య స్టాల్స్ ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## మంత్రివర్గ కమిటీలతో కాలయాపన

### - రాష్ట్ర వైఎస్సార్‌సీటిఏ కోశాధికారి రెడ్డిశేఖర్‌రెడ్డి ఆరోపణ

చిత్తూరు,అక్టోబర్ 18 ప్రభాతవార్త: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మంత్రివర్గ కమిటీల పేరుతో కాలయాపన చేయడం తగదని రాష్ట్ర వైఎస్సార్‌సీటిఏ కోశాధికారి రెడ్డిశేఖర్‌రెడ్డి ఆక్షేపించారు. మంత్రివర్గ ఉపసంఘంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒరిగేది ఏమీ లేదన్నారు. ప్రభుత్వానికే కాదు ఆర్థిక ఇబ్బందులు ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూడా ఉంటాయని పండగల వేళ ఉద్యోగ,ఉపాధ్యాయుల కుటుంబాల్లో సంతోషం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## బిజెపి చీఫ్ మాధవ్‌కు ఆత్మీయస్వాగతం



తిరుపతి,అక్టోబర్ 18ప్రభాతవార్త: తిరుపతిలో జరిగిన ధన్వంతరిజయంతి వేడుకల్లో పాల్గొనేందుకు శనివారం ఉదయం విచ్చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్‌కు ఆత్మీయ స్వాగతం లభించింది. ఉదయం రైల్వేస్టేషన్‌లో మాధవ్‌కు బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, భాస్కర్, అజయకుమార్, వరప్రసాద్, నాగోతు హరి పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు. దుశ్శాలువతో సన్మానించారు. కూటమి పార్టీల ప్రభావం,ప్రజలకు అందిస్తున్న సేవలు అడిగి తెలుసుకున్నారు.